పోడు సమస్యను త్వరలో పరిష్కరిస్తా

- మెరుగైన రవాణా సౌకర్యానికి కృషి చేస్తా
- భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణరావు

సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్, డిసెంబర్ 12 : పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతుల సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మంగళవారం భూపాలపల్లి మండలంలోని నాగారం, ఆజంనగర్, నందిగామ, పంబాపూర్, దీక్షకుంట, దూదేకులపల్లి, గొల్లబుద్దారం, చికెన్‌పల్లి, రాంపూర్, కమలాపూర్, ఆముదాలపల్లి గ్రామాల్లో నిర్వహించిన కృతజ్ఞతా సభలకు ఆయన హాజరుకాగా, మహిళలు మంగళహారతులతో స్వాగతం పలుకగా, కాంగ్రెస్ నాయకులు శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అటవీ గ్రామాలన్నింటికి మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు కృషిచేస్తానన్నారు. నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం క్యాంపు కార్యాలయంలో ప్రతి బుధవారం ప్రజాదర్బార్ ఏర్పాటు చేస్తానన్నారు. ఎన్నికల్లో తనకు ఓటేసి అత్యధిక మెజార్టితో గెలిపించిన ప్రజలందరికీ రుణపడి ఉంటానని ఎమ్మెల్యే పేర్కొనారు. కార్యక్రమంలో డీసీసీ ప్రెసిడెంట్ అయిత ప్రకాష్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు దొమ్మాటి సాంబయ్య, రాష్ట్ర నాయకులు కటంగూరి రాంనర్సింహారెడ్డి, భూపాలపల్లి రూరల్ మండలాధ్యక్షుడు సుంకరి రామచంద్రయ్య, టీపీసీసీ సభ్యుడు చల్లూరి మధు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న ఐద్వా మహిళలు

మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలి

ఐద్వా రాష్ట్ర సహాయ కారద్యర్శి రత్నమాల

కృష్ణకాలనీ, డిసెంబర్ 12 : కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం వెంటనే మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర సహాయ కార్యదర్శి కనిగంటి రత్నమాల డిమాండ్ చేశారు. మహిళా హక్కులను మానవ హక్కులుగా పరిగణించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రత్నమాల మాట్లాడుతూ డిసెంబర్ 12ను అంతర్జాతీయ మహిళా హక్కుల దినంగా పరిగణించినట్లు తెలిపారు. మహిళలు పురుషులతో సమానంగా ఉండాలనే లక్ష్యంతో 1/3 రిజర్వేషన్లు కల్పించాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగంలో రాశాడన్నారు. దానిని నేటి పాలకులు పూర్తిగా అణగదొక్కారన్నారు. బీజేపీ ప్రభుత్వం మహిళల ఓట్ల కోసం మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టినట్లు చేసి దానిని పూర్తిగా పక్కకు పెట్టిందన్నారు. వెంటనే మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని, లేనిపక్షంలో దేశవ్యాప్త ఆందోళన చేస్తామని రత్నమాల హెచ్చరించారు. కార్యక్రమంలో ఐద్వా సభ్యులు పాల్గొన్నారు.

నిల్వ ఉన్న నీటిని పారబోస్తున్న వైద్య సిబ్బంది

సీజనల్ వ్యాధులపై అవగాహన

మహదేవపూర్, డిసెంబర్ 12 : మండలంలోని అంబట్‌పల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం డ్రై డే నిర్వహించారు. మురుగు నీరు వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. ఇంటి ఆవరణలో నిల్వ ఉన్న నీటిని వైద్య సిబ్బంది పారబోశారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. దోమల నివారణ చర్యలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ్ కుమార్, హెల్త్ సూపర్ వైజర్ మాషూక్ అలీ, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఏఎన్ఎంలు కనకదుర్గ, శ్రీలత, శైలజ, ఆశ కార్యకర్తలు సారక్క తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక చేయూత

చిట్యాల, డిసెంబర్ 12 : మండలంలోని చల్లగరిగె గ్రామానికి చెందిన చర్లపల్లి రాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, అతడి పదో తరగతి మిత్రులు ఆర్థిక చేయూతనందించారు. స్నేహితులంతా కలిసి జమ చేసిన రూ. 25 వేలను బాధిత కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు. ఈ మేరకు బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం చేస్తున్న మిత్ర బృందం

మిర్చికి తెగుళ్లపై క్షేత్ర స్థాయి పరిశీలన

మహదేవపూర్, డిసెంబర్ 12 : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఉద్యానశాఖ మండల అధికారి డీ రమేశ్ మంగళవారం మిర్చి పంటలకు ఆశించిన తెగుళ్లపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. పంటలో పలుచోట్ల తామర పురుగు, వడలు, విల్ట్, ముడుత, బూడిద తెగుళ్లలను గుర్తించినట్లు తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మిర్చి రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలని సూచించారు. తెగుళ్లు, చీడ పీడల నివారణ చర్యలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈవో ధర్మేందర్, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మిర్చి రైతులకు సూచనలిస్తున్న ఉద్యాన శాఖ అధికారి రమేశ్

ఆరోగ్య కేంద్రాన్ని వినియోగించుకోవాలి

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రోహిణి

కృష్ణకాలనీ, డిసెంబర్ 12 : అనారోగ్యంతో బాధపడుతున్న మహిళలు ఆరోగ్య కేంద్రాన్ని వినియోగించుకోవాలని భూపాలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రోహిణి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కారల్ మార్క్స్ కాలనీలోని ఆరోగ్య కేంద్రంలో మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలకు ఆరోగ్య కేంద్రం వరం లాంటిదన్నారు. ప్రతి మహిళ తన ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ల్యాబ్ అసిస్టెంట్ రాజు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పట్టు గూళ్లను లెక్కిస్తున్న సిబ్బంది

పట్టు గూళ్ల లెక్కింపు

మహదేవపూర్, డిసెంబర్ 12 : మండల కేంద్రంలోని సెరికల్చర్ కార్యాలయ ఆవరణలో దసలి పట్టు రెండో పంట పట్టు గూళ్ల లెక్కింపు కొనసాగుతున్నది. మండలంలోని సుమారు 130 మంది రైతులు 260 హెక్టార్లలో సాగు చేసిన పట్టు పంట గూళ్లను సేకరించి కార్యాలయానికి తరలించినట్లు మంగళవారం సెరికల్చర్ మండల అధికారి సమ్మయ్య తెలిపారు. మరో రెండు మూడు రోజుల్లో గూళ్ల లెక్కింపు ముగుస్తుందన్నారు. ఈ ఏడాది సుమారు 5 లక్షల గూళ్ల వరకు కౌంట్ వచ్చే అవకాశం ఉందన్నారు. గతంలో కంటే ఈ ఏడాది దసలి పట్టు పంట దిగుబడి అధికంగా ఉండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సమ్మె చేస్తున్న గ్రామీణ తపాల సిబ్బంది

తపాల సిబ్బంది నిరవధిక సమ్మె

కాటారం, డిసెంబర్ 12 : తమ డిమాండ్ల పరిష్కారం కోసం ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్, నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ డాక్ సేవక్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నట్లు జీడీఎస్ ఉద్యోగులు తెలిపారు. గత కొన్నేళ్లుగా సమస్యలను కేంద్రం ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సివిల్ సర్వంట్ హోదా ఇవ్వాలని, 8 గంటల పని ఇవ్వాలన్నారు. అలాగే అదనపు సర్వీస్ ఇంక్రిమెంట్లు, ఉద్యోగులకు రూ. 5 లక్షల ఇన్సూరెన్స్, రూ. 5 లక్షల గ్రాట్యుటీ ఇవ్వాలని, కుటుంబ సభ్యులకు వైద్య సదుపాయం కల్పించాలని కోరారు. కమలేష్ చంద్ర కమిటీ సిఫారసులను అమలు చేయాలన్నారు. కమీషన్ పద్ధతిని రద్దు చేస్తూ అన్ని రకాల సేవింగ్స్ స్కీంలను పని భారంలోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐజీడీఎస్‌యూ సెక్రెటరీ కుడుదుల కిష్టయ్య, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం బస్తాలను లారీలో లోడ్ చేస్తున్న కూలీలు

రైతులతో మాట్లాడుతున్న డీఎం వెంకటేశ్వరరావు

ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు

మహదేవపూర్, డిసెంబర్ 12 : మండలంలోని బొమ్మాపూర్‌లో కేడీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం క్రయ విక్రయాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇప్పటి వరకు సుమారు 22 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి లారీలో తరలించినట్లు సెంటర్ నిర్వాహకులు తెలిపారు. కొనుగోలు కేంద్రంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం సంస్థ డీఎం వెంకటేశ్వరరావు పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట సెంటర్ ఇన్‌చార్జి గద్ద సమ్మిరెడ్డి, సిబ్బంది, రైతులు తదితరులున్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త జనులకు తెలియజేయునది ఏమనగా! నా క్లయింటు అయిన అవినాష్ అబసో జాదవ్, తండ్రి: అబసో జాదవ్, వయస్సు: 24 సంవత్సరాలు, వృత్తి: వ్యాపారం, నివాసం: విశ్వకర్మ వీధి, వరంగల్ గారు బొమ్మడెని కృష్ణవేణి, భర్త: ప్రవీణ్, వయస్సు: 32 సం.లు, వృత్తి: గృహిణి, నివాసం: రామన్నపేట, వరంగల్ గారితో ఈ క్రింద పేర్కొనబడిన షెడ్యూల్ దాఖలా ఆస్తి కొనుగోలు నిమిత్తము విక్రయ ఒప్పంద పత్రము చేసుకొని కొంత మొత్తం భయనగా ఇచ్చియున్నారు. కావున క్రింద పేర్కొనబడిన ఆస్తిపై ఎవరికైనా ఎటువంటి అభ్యంతరాలు, ఆవక్షేపణలు ఉన్న యెడల నేటి నుండి ఏడూ (7) రోజులలో నాకు గాని, నా క్లయింటుకు గాని లిఖితపూర్వకంగా ఆధారాలతో సంప్రదించగలరు. గడువులోపు ఎటువంటి అభ్యంతరాలు, ఆక్షేపణలు రానిచో నా క్లయింటు మిగిలిన డబ్బులు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోగలరు. గడువు తదుపరి వచ్చు అభ్యంతరాలు ఆక్షేపణలు చెల్లనేరవు మరియు అంగీకరించబడదు. బొమ్మడెని కృష్ణవేణి గారు షెడ్యూలులో చూపబడిన ఆస్తికి సంబంధించిన ఖాళీ జాగా విక్రయ దస్తావేజు డాక్యుమెంటు నెంబరు: 7660/2019 యస్.ఆర్.ఓ. వరంగల్ (ఫోర్ట్) ద్వారా ఖరీదు చేసినారు.

షెడ్యూలు ఆస్తి: ఉర్సు బీరన్నకుంట, కరీమాబాద్, వరంగల్ జిల్లాలో ఇంటి నెం. 17-2-283/3, (ప్లాట్ నెం. 5) సర్వే నెం. 460, ఉర్సు గ్రామం, ఖిలా వరంగల్ మండలం, వరంగల్ జిల్లాలోనిది, మొత్తం విస్తీర్ణం: 100.00 చదరపు గజాలు గల దానికి హద్దులు: తూర్పు: 15 ఫీట్ల రోడ్డు, పడమర: కె. పెద్ద మల్లయ్య గారి ఇల్లు, ఉత్తరం: ప్లాట్ నెంబరు: 4, దక్షిణం: జి. స్వేత గారి ఇల్లు.

గమనిక: ఈ ప్రకటన నా క్లయింటు కోరికమేరకు ఇవ్వనైనది.

తేది: 12-12-2023,

ఇట్లు: **మార్గం అమరేందర్,** అడ్వకేట్-నోటరీ, దేశాయిపేట్ రోడ్, యల్.బి. నగర్, వరంగల్. ఫోన్: 0870-2565304. సెల్: 9493319374.